కళాశాల భవన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి

- అరకు డిగ్రీ కాలేజీని సందర్శించిన కలెక్టర్ దినేశ్‌కుమార్
- వసతులపై ఆరా
- తక్షణ చర్యలకు ఆదేశం

- వార్త 6వ పేజీలో..

ఐటీడీఏల్లో వింత పోకడ

పాడేరు, రంపచోడవరం టీడబ్ల్యూ డిప్యూటీ డైరెక్టర్లుగా ఏటీడబ్ల్యూవోలకు బాధ్యతలు

- జిల్లా స్థాయి పోస్టుల బాధ్యతలను మండల స్థాయి అధికారులకు అప్పగించడంపై విమర్శలు
- తాజా పరిణామాలతో గిరిజన సంక్షేమ విద్యాశాఖలో పర్యవేక్షణ గాలికి..
- దీని వెనుక ఏదో మిస్టరీ ఉందని అనుమానాలు


పాడేరులోని ఐటీడీఏ కార్యాలయం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల్లో ఇటీవల విచిత్రమైన వ్యవహారాలు చోటుచేసుకోవడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రధానంగా జిల్లా స్థాయిలో ఉండే గిరిజన సంక్షేమ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ పోస్టులను మండల స్థాయిలో ఉండే అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ల(ఏటీడబ్ల్యూవో)కు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పైరవీల నేపథ్యంలోనే ఐటీడీఏల్లో ఈ అడ్డగోలు వ్యవహారాలకు అధికారులు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.


రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం

పాడేరు ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న కొండలరావును నిబంధనలకు విరుద్ధంగా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు కలిసి అనధికారికంగా రంపచోడవరం ఐటీడీఏకి పంపించారు. దీంతో ఇదే అదనుగా స్థానికంగా ఉన్న ఒక మండల స్థాయి అధికారైన ఏటీడబ్ల్యూవోకు టీడబ్ల్యూ డీడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పి కొండలరావును గాల్లో ఉంచేలా చేశారని సమాచారం. కలెక్టర్, ఐటీడీఏ పీవో, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖలోని ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో చేసేది లేక సదరు బాధిత డీడీ కొండలరావు రంపచోడవరం వెళ్లి ఎటువంటి పని(అధికారం) లేకపోవడంతో అక్కడ కాలక్షేపం చేస్తున్నారు. ఈ పరిణామంతో అప్పటికే అక్కడ టీడబ్ల్యూ డీడీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) జాన్‌రాజ్ ఒకింత అసహనానికి గురై మిన్నకున్నారు. దీంతో రంపచోడవరానికి ఇద్దరు టీడబ్ల్యూ డీడీలు అంటూ అక్కడ ఉపాధ్యాయ వర్గాల్లో రెండు వారాలుగా విస్తృత ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు జిల్లా స్థాయి అధికారులను సైతం పక్కన పెట్టి, తాజాగా మండల స్థాయి అధికారికి గిరిజన సంక్షేమ శాఖ డీడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

రంపచోడవరం టీడబ్ల్యూ డీడీగా కాకినాడ ఏటీడబ్ల్యూకు బాధ్యతలు

రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీగా కాకినాడలో ఏటీడబ్ల్యూవో(మండల స్థాయి అధికారి)గా పని చేస్తున్న ఎస్.విజయశాంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజ్ గత కొంతకాలంగా టీడబ్ల్యూ డీడీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో అంటే రెండు వారాల క్రితం ఇక్కడ టీడబ్ల్యూ డీడీ కొండలరావును రంపచోడవరం పంపేశారు. దీంతో అక్కడ ఎవరు టీడబ్ల్యూ డీడీ అనేది చర్చనీయాంశంగా ఉన్న క్రమంలో తాజాగా కాకినాడలో పని చేస్తున్న ఏటీడబ్ల్యూవోకు డీడీగా బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

గిరిజన సంక్షేమ విద్యాశాఖలో పర్యవేక్షణ గాలికే..

జిల్లాలోని పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల్లో గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ పోస్టుల్లో మండల స్థాయి అధికారుల నియామకంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ విద్యపై ... మిగతా 6వ పేజీలో

గంజాయి రవాణాపై గట్టి నిఘా

పాడేరు ఏఎస్‌పీ కె.ధీరజ్ వెల్లడి


మాట్లాడుతున్న ఏఎస్‌పీ కే.ధీరజ్, పక్కన సీఐ వెంకటరావు, ఎస్‌ఐ రమణ

- రాత్రి 11 దాటితే బయట తిరగవద్దని ప్రజలకు సూచన

పాడేరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గంజాయి రవాణాపై పటిష్ట నిఘా పెట్టామని స్థానిక ఏఎస్‌పీ కె.ధీరజ్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో గంజాయి సాగు, రవాణాపై నిఘా పెంచామని, ఈ క్రమంలో తమ కళ్లు గప్పి గంజాయి రవాణా చేయలేరన్నారు. అలాగే వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని, ఈ క్రమంలో ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి తరలుతున్న గంజాయి పట్టుబడుతున్నదన్నారు. తాజాగా పెదబయలు మండలం రోగులపేట కూడలి వద్ద వ్యాన్‌లో తరలిస్తున్న 455 కిలోల గంజాయితో నలుగురిని అరెస్టు చేశామన్నారు. అలాగే ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి వ్యాన్‌లో తరలిస్తున్న 120 కిలోల గంజాయిని ముంచంగిపుట్టు మండల కేంద్రంలో పట్టుకున్నామని చెప్పారు. ప్రజలు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని ఆయన కోరారు.

రాత్రి వేళ బయట తిరగవద్దు

ఏజెన్సీలో రాత్రి 11 గంటలు దాటిన తరువాత ప్రజలు బయట తిరగవద్దని స్థానిక ఏఎస్‌పీ కె.ధీరజ్ హెచ్చరించారు. అత్యవసరానికి మినహా ప్రజలు రాత్రివేళ సంచరించవద్దన్నారు. గంజాయి రవాణా, బైక్‌ల దొంగతనాలు, ఇళ్ల చోరీలపై నిఘాలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు గమనించాలన్నారు. చోరీలను అరికట్టేందుకు పోలీసులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఏఎస్‌పీ కోరారు. ఈ సమావేశంలో జి.మాడుగుల సీఐ వెంకటరావు, పాడేరు, పెదబయలు ఎస్‌ఐలు సూర్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

455 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురిని రిమాండ్‌కు తరలింపు
- జువైనల్ హోమ్‌కు మైనర్


పట్టుబడిన గంజాయి, నిందితులతో జి.మాడుగుల సీఐ వెంకటరావు, పెదబయలు ఎస్‌ఐ రమణ

పెదబయలు, అక్టోబరు 3: ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్న 455 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జి.మాడుగుల సీఐ సీహెచ్ వెంకటరావు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఆయన వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం పెదబయలు ఎస్‌ఐ రమణ ఆధ్వర్యంలో సీతగుంట పంచాయతీ రోగులపేట జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కుజబంగి, బంగారుమెట్ట వైపు నుంచి పెదబయలు వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తున్న క్రమంలో మరో రెండు ద్విచక్ర వాహనాలు, వాటి వెనుక ఓ వ్యాన్ వస్తుండడాన్ని గమనించారు. పోలీసులను చూసి వ్యాన్‌లోని ఇద్దరు, ద్విచక్ర వాహనం నుంచి ఒకరు పరారయ్యారు. నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని వ్యాన్‌లోని 18 బస్తాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని తూకం వేయగా 455 కిలోలుగా తేలింది. ఈ గంజాయిని తరలిస్తున్న జీకే వీధి మండలం ఆర్‌వీ నగర్ గ్రామానికి చెందిన శెట్టి ఆసిస్‌కుమార్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందపూర్ బ్లాక్ గేలూరు పంచాయతీ కూడుబు గ్రామానికి చెందిన పాంగి ప్రశాంత్, ఒడిశా రాష్ట్రం కంఠ గ్రామానికి చెందిన శెట్టి సుశాంత్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఓ బాలుడు ఉండడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు. రవాణాకు ఉపయోగించిన వ్యాన్, మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.5,300 నగదును సీజ్ చేశామని సీఐ తెలిపారు.

ముంచంగిపుట్టులో 120 కిలోలు..


వ్యాన్ క్యాబిన్‌లో ఉన్న గంజాయి ప్యాకెట్లు

ముంచంగిపుట్టు: ఒడిశా నుంచి వస్తున్న ఓ వ్యాన్‌లోని 120 కిలోల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ కె.రవీంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ముంచంగిపుట్టులో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఆ సమయంలో ఒడిశా నుంచి ఓ వ్యాన్ వస్తోంది. పోలీసులను చూసి ఆ వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు వ్యాన్ వద్దకు వెళ్లి తనిఖీ చేయగా ఏమీ కనిపించలేదు. పోలీసులకు అనుమానం వచ్చి వ్యాన్ క్యాబిన్ లోపల తనిఖీ చేశారు. గంజాయి ప్యాకెట్లు ఉండడాన్ని గుర్తించి బయటకు తీశారు. తూకం వేయగా 120 కిలోలు ఉన్నట్టు తేలింది. వ్యాన్‌లో ఉన్న ఒడిశా కోరాపుట్టు జిల్లా నందపూర్ బ్లాక్ గేలూరు పంచాయతీ ఖుదా గ్రామానికి చెందిన మండి చిలకమ్మ, గంహిగూడ గ్రామానికి చెందిన కొర్రా కాంతమ్మలను అదుపులోకి తీసుకున్నారు. పరారైన డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఎప్పటికి దారికొచ్చేనో?

గోతులమయంగా చోద్యం- బాలారం రోడ్డు

- 40 గ్రామాల ప్రజల అవస్థలు
- గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో కష్టాలు


కన్నంపేట సమీపంలో గోతులమయంగా రహదారి

కొయ్యూరు, అక్టోబరు 3:

మండలంలో సుమారు 40 గ్రామాలకు ప్రధాన రహదారి అయిన చోద్యం- బాలారం రోడ్డు గోతులతో దారుణంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అడుగుకో గొయ్యి ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మండలంలోని చోద్యం- బాలారం ప్రధాన రహదారి గోతులమయంగా ఉండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఈ రహదారి మరమ్మతులకు గత వైసీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించి అప్పటి పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆట్టహాసంగా శంకుస్థాపన చేశారు. కానీ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. ఈ రహదారి గుండా బాలారం, కంఠారం, బకులూరు, కొమ్మిక పంచాయతీలకు చెందిన సుమారు 40 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. అయితే ఎన్నికలకు ఏడాది ముందు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఈ రహదారి మరమ్మతులకు నిధులు మంజూరైనట్టు నమ్మించి శంకుస్థాపన చేశారు. అయితే అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ప్రారంభంకాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి మరీ దారుణంగా తయారైంది. బాలారం సమీప ఏకలవ్య పాఠశాల నుంచి డి.మల్లవరం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. మల్లవరం- కొత్తూరుల మధ్య సుమారు రెండు కిలోమీటర్లు మేర అడుగడుగునా మోకాలి లోతు గోతులు పడ్డాయి. కొత్తూరు నుంచి కన్నంపేట మధ్య పెద్ద గోతులు పడి ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉండి ఈ రహదారి చెరువును తలపిస్తున్నది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ రహదారికి మరమ్మతులు చేపడతారని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


డి.మల్లవరం సమీపంలో ఇలా..

ఆదిలక్ష్మిగా కనకమహాలక్ష్మి


బురుజుపేటలో ఆదిలక్ష్మిగా కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశాఖలోని బురుజుపేటలో కొలువైన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు తొలిరోజు గురువారం ఆదిలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. శుక్రవారం నుంచి విజయదశమి పర్వదినం వరకు రోజుకో అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. శుక్రవారం ధనలక్ష్మి రూపంలో కొలువుదీరనున్న కనకమహలక్ష్మికి లక్ష చామంతుల పూజ చేస్తారు. 5న ధాన్యలక్ష్మిగా, 6న ధైర్యలక్ష్మిగా, 7న సంతానలక్ష్మిగా, 8న విజయలక్ష్మిగా, 9న విద్యాలక్ష్మిగా, 10న గజలక్ష్మిగా, 11న మహాలక్ష్మిగా దర్శనమిస్తారు. 12న విజదశమి పర్వదినాన కనకమహాలక్ష్మిగా నిజరూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారికి స్వర్ణ కవచధారణ, స్వర్ణపుష్పాలతో అలంకరణ చేస్తారు. - విశాఖపట్నం

సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లాకు ప్రథమ స్థానం

అధికారులు, సిబ్బందిని అభినందించిన కలెక్టర్

పాడేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. జిల్లాలోని మొత్తం 22 మండలాల పరిధిలో మొత్తం 1,24,778 మంది సామాజిక పెన్షన్‌ల లబ్ధిదారులకు గురువారానికి 1,24,190 మందికి పెన్షన్ అందించి 99.53 శాతంగా నమోదైంది. జిల్లాలో రోడ్లు, సమాచార వ్యవస్థ అరకొరగా ఉన్నప్పటికీ గ్రామ సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది సకాలంలో లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును అందించారు. దీంతో జిల్లాలో మూడు రోజుల్లో పెన్షన్ల పంపిణీలో 99.53 శాతంగా నమోదైంది. రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీలో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ, కర్నూలు ద్వితీయ, చిత్తూరు తృతీయ స్థానాల్లో నిలిచాయి. దీంతో జిల్లాలో సామాజిక పెన్షన్ల పంపిణీలో ఎంతో కృషి చేసిన డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, వెలుగు సిబ్బంది, ఎంపీడీవోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

టెట్ ప్రారంభం

తొలిరోజు ఎనిమిది కేంద్రాల్లో నిర్వహణ

87.48 శాతం హాజరు


పరీక్షకు హాజరైన అభ్యర్థులు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం ప్రారంభమైంది. జిల్లాలో తొలిరోజు ఉదయం ఐదు, మధ్యాహ్నం మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్‌లో రెండు కేంద్రాలు, పెదగంట్యాడలోని ఎస్‌వీఎస్ టెక్నాలజీస్, బుచ్చిరాజుపాలెంలోని ఏడీజడ్ ఆరోహణ జోన్, మధురవాడ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 2,225 మందికిగాను 1,977 మంది (88.85 శాతం), మధ్యాహ్నం చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్‌లో రెండు కేంద్రాలు, బుచ్చిరాజు పాలెంలోని ఏడీజడ్ ఆరోహణ జోన్‌లో 1,706 మందికి 1,462 (85.69 శాతం) మంది..మొత్తం 3,931కి 3,439 మంది (87.48 శాతం) పరీక్షకు హాజరయ్యారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఫిబ్రవరిలో ఒకసారి టెట్ నిర్వహించారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో డీఎస్సీ నిర్వహణ అప్పట్లో ఆటకెక్కింది. ఎన్నికల తరువాత మెగా డీఎస్సీ నిర్వహణ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతకం చేశారు. దీంతో మరోమారు టెట్ నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో పరీక్ష రాసిన వారిలో అత్యధికులు మెరుగైన మార్కుల కోసం మళ్లీ పరీక్ష రాస్తున్నారు. కాగా పరీక్షా కేంద్రాలను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సందర్శించారు. కేంద్రాల్లో అభ్యర్థులకు తగిన వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఏకలవ్యలో ఉత్సాహంగా కల్చరల్ ఫెస్ట్


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

అరకులోయలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి కల్చరల్, లిటరరీ ఫెస్ట్ గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 28 గురుకులాల నుంచి 800 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ వేడుకలకు హాజరయ్యారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే మత్స్యలింగం, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర తదితరులు పాల్గొన్నారు. - వార్త 6వ పేజీలో..

అరకులోయలో రాష్ట్ర స్థాయి ఈఎంఆర్ఎస్ ఫెస్ట్ ప్రారంభం

- మూడురోజులు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు
- 28 పాఠశాలల నుంచి 800 బాలబాలికలు హాజరు

అరకులోయ, అక్టోబరు 3: అరకులోయలో రాష్ట్ర స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల కల్చరల్, లిట్రరీ ఫెస్ట్ గురువారం ప్రారంభమైంది. ఈ ఫెస్ట్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే మత్స్యలింగం, టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర, పెదలబుడు, పద్మాపురం సర్పంచులు దాసుబాబు, సుస్మిత ప్రారంభించారు. రాష్ట్రంలో 28 ఈఎంఆర్ఎస్‌ల నుంచి 800 మంది బాల బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభను కనబరచాలన్నారు.

క్రమశిక్షణతో కూడిన సంస్కారం నేర్చుకోవాలని, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని సూచించారు. ఎమ్మెల్యే మత్స్యలింగం, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వాలు కల్పించే వసతులను సద్వినియోగం చేసుకోవాలని, గురువుల పట్ల గౌరవంగా మెలగాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఏకలవ్యుడ్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు రోష్నీ, పెదలబుడు,పద్మాపురం సర్పంచులు దాసుబాబు, సుస్మిత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కరరావు, గురుకుల ఉపకార్యదర్శి రమణ మూర్తి, ఐటీడీఏ పాడేరు గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ పీఎస్ఎన్‌మూర్తి అతిథులకు జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ప్రతిభా, పాటవాల ప్రదర్శనకు వేదిక : కలెక్టర్

విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు రాష్ట్ర స్థాయి కల్చరల్ ఫెస్టు చక్కటి వేదిక అని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర స్థాయి ఈఎంఆర్ఎస్‌లో గురువారం సాయంత్రం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ క్రీడా స్ఫూర్తితో చక్కని వాతావరణంలో ప్రతిభ కనబరచాలన్నారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి.


విద్యార్థుల సాంస్కృతిక పోటీలను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

డిగ్రీ కళాశాల శిథిల భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

అరకులోయ, అక్టోబరు 3: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం సాయంత్రం కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సందర్శించారు. ఇటీవల కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్.భరత్‌కుమార్ నాయక్, పి.చలపతిరావు కలెక్టర్‌ను కలిసి డిగ్రీ కళాశాల భవనాల దుస్థితిపై వినతిపత్రాన్ని అందజేశారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని, పాత భవనం శిథిలస్థితికి చేరడంతో శ్లాబ్‌పెచ్చులు పడి విద్యార్థులు గాయపడుతున్నారని పేర్కొన్నారు. కళాశాలకు నూతనంగా అదనపు భవనాలకు నిధులు మంజూరు చేయాలని, పాతభవనం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీంతో గురువారం అరకులోయ వచ్చిన కలెక్టర్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలల ప్రిన్సిపాళ్లు భవనాల పరిస్థితి, విద్యార్థుల సంఖ్య, వసతులు వివరించారు. అనంతరం శిథిలస్థితిలో ఉన్న పాతభవన సముదాయాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్ పరిశీలించారు. పాత భవన సముదాయం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఈఈ వేణుగోపాల్, డీఈ సుబ్బారావు, ఏఈఈ అభిషేక్‌లను ఆదేశించారు. అవకాశం ఉన్న మేరకు పాతభవనానికి మరమ్మతులు చేయిస్తానని, తరగతుల నిర్వహణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా కళాశాల నూతన భవన సముదాయాల గురించి ప్రిన్సిపాల్ చలపతిరావు కలెక్టర్‌కు వివరించారు.


పాత డిగ్రీ కళాశాల శిథిల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హుకుంపేటలో దట్టంగా మంచు


హుకుంపేటలో ప్రధాన రహదారిలో మంచు

మండల కేంద్రమైన హుకుంపేటలో గురువారం ఉదయం మంచు దట్టంగా కురిసింది. ఉదయం 9గంటల వరకు మంచు పడింది. దీంతో అరకు-పాడేరు ప్రధాన రహదారిలో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం సాగించారు. -హుకుంపేట

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అరకులోయ విద్యార్థులు



అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు,కోచ్‌లతో ప్రిన్సిపాల్ మూర్తి

అరకులోయ, అక్టోబరు 3: రాజమహేంద్రవరంలో ఈనెల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అరకులోయ గురుకుల క్రీడాపాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ పోటీలు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరగనున్నట్టు ఆయన తెలిపారు. క్రీడా పాఠశాల నుంచి టి.గణేష్, టి.సూర్యనారాయణ, వై.రితిన్, ఎస్.కుమారస్వామి, ఎస్.మల్లేష్, కె.సాయికిరణ్, కె.సాయి చరణ్‌లతో పాటు కోచ్ డి.కొండలస్వామి, కె.గణపతి పాల్గొంటున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అవకాశం

నర్సీపట్నం, అక్టోబరు 3 : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కోసం పలువురు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎల్.రామారావుకు దరఖాస్తులు అందజేశారు. నవంబరు 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని డీజీ నాథ్ తెలిపారు. 2018 నవంబరు నుంచి 2024 నవంబరు వరకు సెకండరీ పాఠశాలలో కనీసం మూడేళ్లు పని చేసిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నేతలు అల్లు అప్పారావు, ఎ.రమణమూర్తి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత, ఆకుల కుమారి, చుక్కల రాము, సుగుణ పాల్గొన్నారు.

మహిళలు దాడులను ప్రతిఘటించాలి

విశాఖ జిల్లా జడ్జి వెంకటశేషమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ వెంకటశేషమ్మ

గొలుగొండ, అక్టోబరు 3 : మహిళలు తమపై దాడులు జరిగితే ప్రతిఘటించాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఉమ్మడి విశాఖ జిల్లా జడ్జి వెంకటశేషమ్మ పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం విధాన్ సే సమాధాన్ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ వెంకట శేషమ్మ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావడం ద్వారా అనేక సమస్యలు పరిష్కరించుకునే సామర్థ్యం అలవడుతుందన్నారు. ఈ సమావేశంలో నర్సీపట్నం మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ,నర్సీపట్నం రూరల్ సీఐ కుమారస్వామి, గొలుగొండ ఇన్‌చార్జి ఎస్ఐ రాజారావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ రేంజ్ అధికారిగా శ్రీనివాసరావు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 3 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ అధికారిగా కె.శ్రీనివాసరావు గురువారం స్థానిక రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి జిల్లా సీలేరు రేంజర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయనకు డిప్యూటీ రేంజ్ అధికారి వి.సత్యనారాయణ, గొలుగొండ సెక్షన్ అధికారులు లక్ష్మణ్, రమణ, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఐటీడీఏల్లో వింత పోకడ

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షణ గాలికి వదిలేసినట్టేననే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఐటీడీఏ స్థాయిలో ఐటీడీఏ పీవో, టీడబ్ల్యూ డీడీ, మండల స్థాయిలో ఏటీడబ్ల్యూవోలు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించినప్పటికీ గిరిజన సంక్షేమ విద్యాశాఖలో అనేక లోపాలు, విద్యార్థులకు అనారోగ్య సమస్యలు, మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో మండల స్థాయిలో పని చేసే ఏటీడబ్ల్యూవోలకు టీడబ్ల్యూ డీడీగా బాధ్యతలు అప్పగిస్తే, తనతో సమానంగా ఉన్న ఏటీడబ్ల్యూవోలు, ఆశ్రమ పాఠశాలల్లోని పీజీ హెచ్‌ఎంలు ఇన్‌చార్జి డీడీ మాటలు వినే పరిస్థితి ఉండదు. ఈ తాజా పరిణామాలతో గిరిజన సంక్షేమ విద్యాశాఖపై పర్యవేక్షణ మరింత కొరవడి గిరిజన విద్యార్థులకు మరింత అన్యాయం జరిగే అవకాశాలున్నాయని విద్యార్థి సంఘాలు భావిస్తున్నాయి. అధికారులు తీసుకునే నిర్ణయాలు గిరిజన సంక్షేమ విద్యాశాఖను బలోపేతం చేసేవిగా ఉండాలే గాని, ఉన్న వ్యవస్థను మరింత బలహీనపర్చేలా చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు ఐటీడీఏల్లో టీడబ్ల్యూ డీడీ బాధ్యతలు నిర్వహించే జిల్లా స్థాయి అధికారులున్నప్పటికీ మండల స్థాయి అధికారులకు ఆ బాధ్యతలు అప్పగించడం వెనుక ఏదో మిస్టరీ ఉందనే వాదన బలంగా వినిపిస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గిరిజన విద్యార్థులకు అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

- బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి అమ్మవారు...
- భవానీలు, భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


పాడేరులో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన అనంతరం పూజలు చేస్తున్న భక్తులు


పెదబయలులో దుర్గాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాడేరురూరల్, అక్టోబరు 3: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శరన్నవరాత్రి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీటీడీ కాంప్లెక్స్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో కమిటీ అధ్యక్షుడు రొబ్బి రాము, ప్రతినిధులు నాగరాజు, నాగు, బుజ్జి, రెమో శ్రీనుల ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్ఎస్.ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, టీడీపీ నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, వైస్ఎంపీపీ గంగపూజారి శివకుమార్,ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి, వర్తన వరలక్ష్మి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు రొబ్బి రాము మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఉన్న షెడ్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహానికి 9 రోజులు ప్రత్యేక పూజలు చేపట్టి భారీ హోమం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. పురాతన శైవ క్షేత్రం ఉమానీలకంఠేశ్వరుని ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరి అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరామం పంతులు భక్తులతో ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. శరన్నవరాత్రులు సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు గురువారం కనకదుర్గమ్మ, మోదకొండమ్మ ఆలయాల్లో భవానీ మాలలను ధరించారు. పట్టణంలోని కనకదుర్గమ్మ, మోదకొండమ్మ, రాజరాజేశ్వరి దేవాలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి.

పెదబయలులో.. మండల కేంద్రంలో శ్రీహరిహర పుత్ర మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవి ఆలయం వద్ద గురువారం మండపాన్ని ఏర్పాటు చేసి దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పలువురు భక్తులు భవానీ మాలలు ధరించారు.

సీలేరులో.. స్థానిక మార్కెట్ సెంటర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక జెన్‌కో పంపుడు స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వికాస్‌కుమార్ పాండే, ఎస్ఐ రామకృష్ణ, సర్పంచ్ దుర్గోల అమ్మవారి నిజరూప దర్శనం అనంతరం కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హుకుంపేటలో.. మండలంలోని కొంతిలిలో భవానీ భక్తులకు మాజీ ఎంపీపీ తమర్బ సత్యమాధవి గురువారం ఆర్థిక సాయం చేశారు. భవానీ భక్తులు పూజలు, దర్శనాల కోసం రూ.50 వేలు అందజేశారు. అనంతరం హుకుంపేటలో భవానీ భక్తులు ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని సత్యమాధవి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గురుస్వాములు శంకరరావు, నాయుడు, శివ, గంగునాయుడు పాల్గొన్నారు.

కొయ్యూరులో.. కొయ్యూరు-రాజేంద్రపాలెం గ్రామాల మధ్య వరాహ గిరిపై వెలసిన కనకదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్, సీత దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం విల్లా శివప్రసాద్, సుప్రియ దంపతులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకాడ బాలరాజు, గ్రామస్థులు అనిశెట్టి చిరంజీవి, మేడిబోయిన చిన్న, ప్రభుదాస్, రాజశేఖర్, నాగేశ్వరరావు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

చింతపల్లిలో.. మండల కేంద్రంలోని రంగా సెంటర్‌లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజలు దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రోజూ మండపంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని, అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సత్తిబాబు, వసుపరి శ్రీనివాసరావు, చింతాడ చిన్న, వర్తకం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు పాల్గొన్నారు.


కొయ్యూరు: అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకెళుతున్న ధర్మకర్త ప్రసాద్ దంపతులు


చింతపల్లిలో దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేసున్న భక్తులు

మండలానికి 2,665 పక్కా ఇళ్లు మంజూరు

- టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు

చింతపల్లి, అక్టోబరు 3: ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో మండలానికి 2,665 పక్కా గృహాలు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో హౌసింగ్ సిబ్బందితో ఎన్డీయే కూటమి నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ ఏడాది జన్‌మన్ పథకంలో మండలానికి అత్యధిక సంఖ్యలో ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క ఇంటికి రూ.2.39లక్షలు మంజూరు చేస్తారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక పార్టీల నాయకులు పక్కా గృహాల నిర్మాణాలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఈ పద్ధతిని మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, అప్పారావు, అబ్బాయిదొర, బేరా సత్యనారాయణ పడాల్, అంద్రాబు లక్ష్మణ్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రమణ, రాజారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

కాఫీ గింజలకు అంతర్జాతీయ ధరలు

- 650 మెట్రిక్ టన్నుల కాఫీ సేకరణ లక్ష్యం
- దళారులను ఆశ్రయించి.. నష్టపోరాదు
- జీసీసీ డీఎం దేవరాజు



చింతపల్లి, అక్టోబరు 3: గిరిజన రైతులు పండించిన కాఫీ గింజలకు అంతర్జాతీయ ధరలు అందిస్తామని జీసీసీ చింతపల్లి డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలో 2024-25 సంవత్సరంలో 650 మెట్రిక్ టన్నుల కాఫీ గింజల సేకరణ లక్ష్యంగాపెట్టుకున్నామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి, నష్టపోరాదన్నారు. ఈ ఏడాది ఆదివాసీ రైతులకు ఐటీడీఏ మ్యాక్స్, జీసీసీ సంయుక్తంగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు.

గత ఏడాది కాఫీ ఉత్పత్తులు ఆశాజనకంగా లేకపోవడంతో 160మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను సేకరించామన్నారు. ఈ ఏడాది రైతులకు మంచి ధర అందిస్తామని, మరో 15 రోజుల్లో అపెక్స్ కమిటీ ధరలను నిర్ణయిస్తుందన్నారు. నవంబరు నుంచి కాఫీ పండ్ల సేకరణ ప్రారంభమవుతుందన్నారు.

పండ్లు సేకరించిన ఆరు గంటల్లో పార్చిమెంట్ చేసుకోవాలన్నారు. జీసీసీ ద్వారా మార్కెటింగ్ చేసుకునే కాఫీ పార్చిమెంట్‌లో తేమ శాతం 10, చెర్రీలో 10.5 ఉండాలన్నారు. రైతులు తొందరపడి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి కాఫీ గింజలను విక్రయించవద్దన్నారు.

సంక్షిప్తంగా..

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరారీ

- తండ్రితో కలిసి ఇంటికి చేరుకున్న విద్యార్థి
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం


విద్యార్థి కిల్లో ప్రభాస్, తండ్రి శరభన్నతో వార్డెన్

అనంతగిరి, అక్టోబరు 3: విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని పినకోట ఆశ్రమ బాలుర పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కిల్లో ప్రభాస్ సోమవారం పరారైనా ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం పాఠశాల వద్ద కిల్లో ప్రభాస్‌కు తీవ్రంగా కడుపునొప్పి వచ్చింది. వెంటనే స్పందించిన వార్డెన్ శెట్టి రాధాకృష్ణ విద్యార్థిని తీసుకొని పినకోట పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్యసేవలను అందించారు. అక్కడ నుంచి కె.కోటపాడు ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్య సేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ కోలుకుంటున్న విద్యార్థి కిల్లో ప్రభాస్, తన తండ్రి శరభన్నతో కలిసి ఎవరికి చెప్పకుండా సోమవారం కేజీహెచ్ నుంచి వచ్చేశారు. విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, విద్యార్థి ఆచూకీ కోసం వార్డెన్ పంపించడంతో కివర్ల పంచాయతీ చీడిగరువు మార్గమధ్యలో ఇద్దరు కనిపించారు. వైద్యసేవలను అందించేందుకు ఆస్పత్రికి వెళదామని వార్డెన్ నచ్చజెప్పినప్పటికీ వినకుండా తండ్రీకొడుకులు ఇంటికి వెళ్లిపోయారు. దీనిపై ఉన్నతాధికారులు సమాచారం అందించానని వార్డెన్ తెలిపారు.

అనంతగిరి ఎస్ఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



అనంతగిరి, అక్టోబరు 3: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా డి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కరక రాము పాడేరు ఎస్బీకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలోని శాంతిభద్రల పరిరక్షణ కృషి చేస్తానన్నారు. అలాగే గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అరికడతానన్నారు.

పాడేరు ఎస్ఐగా సూర్యనారాయణ..



పాడేరురూరల్, అక్టోబరు 3: పాడేరు పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సూర్యనారాయణ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన జి.లక్ష్మణరావు శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లగా.. అనకాపల్లి జిల్లా చోడవరం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణను ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. యువత మత్తుకు దూరమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు.

కొర్రాలో గ్రామసభ

డుంబ్రిగుడ, అక్టోబరు 3: మండలంలోని కొర్రా గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శైలజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధికి చేపట్టే పనులపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అర్జున్ మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు, తాగు నీరు, వీధి కాలువలు, వీధి దీపాలు మరమ్మతులకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఇందుకు వార్డు సభ్యులు, గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం ఏపీవో ఎస్. రామస్వామి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విశాఖ-భద్రాచలం బస్సు పునరుద్ధరణ

సీలేరు, అక్టోబరు 3: విశాఖపట్నం డిపో అధికారులు ఎట్టకేలకు భద్రాచలం బస్‌ను గురువారం పునరుద్ధరించారు. జీకేవీధి-సీలేరు మార్గంలో గత నెల 8న కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడడంతో బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. బుధవారం నర్సీపట్నం-సీలేరు బస్సును నర్సీపట్నం పీటీడీ అధికారులు పునరుద్ధరించగా.. గురువారం విశాఖపట్నం-భద్రాచలం బస్సును విశాఖపట్నం పీటీడీ అధికారులు నడిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం కలిగింది.

ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన


మూలపుట్టు రైతులకు సాగుపై వివరిస్తున్న ఏవో

ముంచంగిపుట్టు, అక్టోబరు 3: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట అధిక దిగుబడి అవుతుందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస బాబు అన్నారు. గురువారం కుమడ, కరిముఖిపుట్టు పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కాఫీ మిరియాల తోటల పెంపకంపై వివరించారు. మేలైన పశుసంపద అభివృద్ధిలో కృత్రిమ గర్భధారణ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో ఉపాధి పనులు

చింతపల్లి, అక్టోబరు 3: ప్రాధాన్య క్రమంలో ఉపాధి పనులు గుర్తించాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. స్థానిక సంపద కేంద్రం వద్ద గ్రామ స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలు ముగింపును పురస్కరించుకుని సర్పంచ్ దురియా పుష్పలత అధ్యక్షతన గ్రామసభను ఏర్పాటుచేశారు. అనంతరం క్లాప్ మిత్రాలను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శి కొరుప్రోలు శ్రీనివాసరావు ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, ధారలక్ష్మిపద్మ, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఎన్డీయే కూటమి నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, నాగ భూషనం, బుజ్జి బాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

మూడు రోజులపాటు నిర్వహణ

- ఈ క్రీడలో నునపర్తి గ్రామానికి ప్రత్యేక స్థానం
- జాతీయ స్థాయిలో సత్తా చాటిన స్థానిక క్రీడాకారులు



నునపర్తిలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణం

అచ్యుతాపురం, అక్టోబరు 3: రాష్ట్ర స్థాయి అండర్ - 19 బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నునపర్తి గ్రామం వేదిక కానున్నది. ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. బాలికల తరపున 13 జట్లు, బాలుర తరపున 13 జట్లు తలపడనున్నాయి.

మండలంలో ఒక మారుమూల గ్రామమైన నునపర్తికి కనీసం బస్సు సౌకర్యం లేదు. ఆటోలు, ద్విచక్ర వాహనాలే ఈ గ్రామస్థులకు దిక్కు. రెండు వేల మంది జనాభా గల ఈ గ్రామం నుంచి జాతీయ స్థాయిలో బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన క్రీడాకారులు ఉన్నారు. 40 ఏళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ గ్రామంలోని క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారు. గతంలో పరవాడ మండలం వాడచీపురుపల్లి పాఠశాలలో తెలుగు పండిట్‌గా చేసిన లెక్కల దేముడు వీరికి ఈ ఆటపై మక్కువ కలిగేలా ప్రోత్సహించారని ఇక్కడ క్రీడాకారులు చెబుతున్నారు. ఆయన ప్రోత్సాహం వల్లే నునపర్తిలో క్రీడాకారులు తయారయ్యారని అంటున్నారు. ఆ తరువాత రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కి ప్రధాన కార్యదర్శిగా చేసిన ఆర్.వెంకటరావు ప్రోత్సాహం వల్ల ఈ గ్రామంలోని క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇక్కడి యువకుల ఆటతీరు చూసిన ఆయన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు వీరిని ఎంపిక చేసేవారు. దీంతో వీరు జాతీయ స్థాయిలో కూడా ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు.

24 ఏళ్ల క్రితం క్లబ్ ఏర్పాటు

ఇక్కడి క్రీడాకారులు జాతీయ స్థాయిలో కూడా రాణిస్తుండడంతో ఈ క్రీడపై అత్యంత మక్కువ గల గొంప నరసింహనాయుడు, పెదపూడి శంకరరావు అధ్యక్ష, కార్యదర్శులుగా 1999లో శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్‌ను స్థాపించారు. అప్పటి నుంచి వీరు ఈ క్లబ్ ఆధ్వర్యంలో యువకులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేవారు. దీంతో ఈ గ్రామంలో చాలా మంది బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తయారయ్యారు. ప్రస్తుతం వీరు 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన చాలా మంది ఈ క్రీడలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించారు. ఈ సంస్థ కార్యదర్శి శంకరరావు కూడా ఈ కోటాలో ప్రస్తుతం రిజర్వు పోలీస్ సీఐగా చేస్తున్నారు. ఇప్పటికీ ఆయన తన సంపాదనలో కొంత ఈ క్రీడకు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలో వంద మంది బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులున్నారు.

ఐపీఎస్ కౌముది దత్తతతో క్రీడా ప్రాంగణం నిర్మాణం

ఇక్కడి క్రీడాకారులకు సరైన క్రీడా ప్రాంగణం లేకపోవడంతో అధికారులకు ఎన్నో అర్జీలు పెట్టినా ఫలితం లేకపోయింది. పంట పొలాలను అప్పటికప్పుడు కోర్టులుగా మార్చి ప్రాక్టీస్ చేసేవారు. కాగా 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ విలేజ్‌లుగా మార్చడానికి ఎవరో ఒక అధికారి గ్రామాలను దత్తత తీసుకొనేవారు. ఇందులో భాగంగా అప్పటి అదనపు డీజీపీ కౌముది ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు క్రీడా ప్రాంగణం నిర్మించాలని ఆయన నిర్ణయించారు. నునపర్తి హరిహర పంచాయతన క్షేత్రానికి వెళ్లే దారిలో లోతైన ప్రదేశంలో ప్రభుత్వ భూమి ఉంది. వందల సంఖ్యలో లారీలతో గ్రావెల్‌ను నింపి చదును చేయించి క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దారు. దీంతో ఇక్కడ క్రీడాకారులకు క్రీడా ప్రాంగణం సమస్య తీరింది. ఇదే ప్రాం గణంలో ప్రస్తుతం రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించబోతున్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌పై మక్కువతో..



బాల్ బ్యాడ్మింటన్‌పై గల మక్కువతో ఈ క్లబ్‌ను 1999లో ప్రారంభించాం. నేను విశాఖ స్టీల్ ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్‌లో కళాసీగా పని చేస్తున్నాను. అలాగే కార్యదర్శి శంకరరావు ఉద్యోగం రాక ముందు చిన్నచిన్న ఉద్యోగాలు చేసి డబ్బులు పోగుచేసి శిక్షణ ఇచ్చేవాళ్లం. గ్రామంలోని క్రీడాభిమానులు కూడా ఆర్థిక సహాయం అందించారు. జిల్లా స్థాయితో పాటు ఉత్తరాంధ్ర స్థాయి పోటీలను నిర్వహించాం. ఇక్కడ ఆడడానికి శాశ్వత కోర్టు లేకపోవడంతో ఎక్కడ ఖాళీ వుంటే అక్కడ నెట్ కట్టి ప్రాక్టీసు చేసేవాళ్లం. ఐపీఎస్ అధికారి కౌముది మా గ్రామాన్ని దత్తత తీసుకున్న వెంటనే క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో మూడు కోర్టులు ఏర్పాటు చేశాం. ఇక్కడే రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నాం.

- గొంప నరసింహనాయుడు, అధ్యక్షుడు, శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్, నునపర్తి

నునపర్తి క్రీడాకారుడు లేకుండా జాతీయ స్థాయి పోటీలు జరగలేదు



నాకు చిన్నప్పటి నుంచి బాల్ బ్యాడ్మింటన్ అంటే చాలా ఇష్టం. ఈ క్రీడలో నాకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. 1999లో తోటి క్రీడాకారుడు నరసింహనాయుడు సహకారంతో శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్‌ను స్థాపించి చాలా మంది క్రీడాకారులను తయారు చేశాం. మేం చిన్నచిన్న ఉద్యోగాలు చేసి వచ్చిన డబ్బులతో నెట్, బాల్, బూట్లు, బ్యాట్‌లు కొని క్రీడాకారులకు ఇచ్చేవాళ్లం. నా వద్ద శిక్షణ పొందిన ఎంతో మంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు. నాకు 2012లో రిజర్వు పోలీస్ ఎస్ఐగా ఉద్యోగం వచ్చింది. ఇప్పటికీ నా సంపాదనలో కొంత నునపర్తిలో క్లబ్‌కి కేటాయిస్తున్నాను. 1995లో నేను మొట్టమొదటి సారిగా జాతీయ స్థాయిలో ఆడాను. అప్పటి నుంచి జాతీయ స్థాయిలో నునపర్తి క్రీడాకారుడు లేకుండా టోర్నమెంట్ జరగలేదు.

- పెదపూడి శంకరరావు, ఆర్ ఎస్ఐ, విశాఖపట్నం

క్రైం... crime news

టిప్పర్ లారీని ఢీకొని యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3: స్థానిక జలగలమదుం జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు. విశాఖ నుంచి అనకాపల్లి వైపు వస్తున్న క్రషర్ లారీ టిప్పర్ సాంకేతిక లోపంతో రోడ్డు పక్కన ఆగి ఉందన్నారు. అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారానికి చెందిన కోరుకొండ సురేశ్(25) అతి వేగంగా ఆగి ఉన్న టిప్పర్ లారీని బలంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి ఇంకా వివాహం కాలేదని, డ్యాన్సర్‌గా పని చేస్తున్నాడని ఎస్ఐ తెలిపారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాలువలో జారిపడి వృద్ధుడి మృతి



సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, అక్టోబరు 3 : మండలంలోని డొంకాడ గ్రామానికి సమీపంలో గల పోలవరం ఎడమ ప్రధాన కాలువలో ఓ వృద్ధుడు కాలుజారి పడి మృతి చెందినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. డొంకాడకు చెందిన కడింపల్లి సత్యనారాయణ (62) బుధవారం సాయంత్రం గేదెను తోలుకు రావడానికి పోలవరం కాలువ వద్దకు వెళ్లాడన్నారు. ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మృతి చెందాడని తెలిపారు. గురువారం ఉదయం పోలవరం కాలువ వద్ద అతని మృతదేహం లభ్యమైందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

గోతిలోపడి ఒకరి మృతి



ముత్తా గోవిందరావు (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, అక్టోబరు 3 : ఉపమాక శివారు కొండ వెనుకపాలెం గ్రామంలోని ఓ గోతిలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు నక్కపల్లి పోలీస్ స్టేషన్ హెచ్‌సీ సత్యనారాయణ గురువారం తెలిపారు. వి.మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారానికి చెందిన ముత్తా గోవిందరావు (40) స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడన్నారు. బుధవారం సాయంత్రం కొండవెనుకపాలెం గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్లి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడి మృతి చెందినట్టు చెప్పారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాకీ తీర్చమన్నందుకు బ్లేడ్లతో దాడి

ఎలమంచిలి, అక్టోబరు 3: బాకీ డబ్బులు ఇమ్మని అడిగినందుకు ఇద్దరి మధ్య తలెత్తిన ఘర్షణ చివరకు బ్లేడ్లతో దాడిచేసే స్థాయికి వెళ్లింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చేరగా, దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎలమంచిలి రూరల్ పోలీసులు గురువారం తెలిపిన వివరాలివి. మండలంలోని కొత్తలి గ్రామానికి చెందిన నూకిరెడ్డి శ్రీనివాస్ గతంలో వంద రూపాయలను బంగారి వెంకటరమణకు అప్పుగా ఇచ్చాడు. తిరిగి ఆ డబ్బులను ఇవ్వాలని అతడు బుధవారం రాత్రి కోరడంతో వీరిద్దరి మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో వెంకటరమణ శ్రీనివాస్‌పై బ్లేడ్లతో దాడి చేయడంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108వాహనంలో అతనిని ఎలమంచిలి సీహెచ్‌సీకి తీసుకు వెళ్లగా అక్కడి నుంచి వైద్యులు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర కేసు నమోదు చేసి వెంకటరమణను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ఇదిలావుంటే, ఇతనిపై గతంలో ఇదే స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. తాజాగా పోలీసులు ఇతనిపై హత్యకు యత్నించినట్టు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్టు

ఎస్.రాయవరం, అక్టోబరు 3: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని మోసగించిన కేసులో ఓ యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్.ఐ విభీషణరావు గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నక్కపల్లి మండలం జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన కొత్తూరు నాగదేవ ఓ రొయ్యల పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తరువాత ముఖం చాటేశాడు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగదేవను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్.ఐ విభీషణరావు తెలిపారు.

జల వనరుల శాఖ ఎస్ఈగా సుగుణాకరరావు



విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా శంబంగి సుగుణాకరరావు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన సూర్యకుమార్ ఈ ఏడాది ఆగస్టు నెలాఖరున పదవీ విరమణ చేశారు. గత నెలాఖరున జరిగిన బదిలీల్లో విజయనగరం జిల్లా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ఎస్ఈగా ఉన్న సుగుణాకరరావును విశాఖ సర్కిల్ ఎస్ఈగా నియమించారు. శ్రీకాకుళం, బొబ్బిలి రెగ్యులర్ సర్కిళ్ల ఎస్ఈగా, విశాఖపట్నంలో నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్‌గా సుగణాకరరావు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. గురువారం బాధ్యతలు తీసుకున్న సుగుణాకరరావును జల వనరుల శాఖ ఇంజనీర్లు అభినందించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కాలువలు, రిజర్వాయర్ల అత్యవసర మరమ్మతుల కోసం రూ.15 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ నిధులు విడుదల జరిగితే నీరు సరఫరాలో ఇబ్బందులు పరిష్కారమవుతాయని అన్నారు. విశాఖ సర్కిల్ పరిధిలో అన్ని రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయన్నారు. సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేదన్నారు.

వ్యవసాయ విద్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు

అనకాపల్లి అగ్రికల్చర్, అక్టోబరు 3: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్య ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు ఈ నెల నుంచి ప్రారంభం కానున్నాయని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాలు, తేనెటీగల పెంపకం, ఎరువులు, వర్మీకంపోస్టు తయారీలో రెండు నెలల సర్టిఫికెట్ కోర్సులకు ఆసక్తివున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కో కోర్సుకు రూ.1500 వంతున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు కంప్యూటర్ లేదా మొబైల్ లేదా ఐపాడ్ ఆన్‌లైన్ సాధనం ఉండాలని పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సులకు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

అప్పన్న ఆలయంలో పలు వైదిక ఉత్సవాలు

సింహాచలం, అక్టోబరు 3: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈ నెలలో పలు వైదిక ఉత్సవాలు జరగనున్నాయి. 4న శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం, 5న స్వాతి నక్షత్ర హవనం, 6న తిరు నక్షత్ర పూజలు, 8న వీరలక్ష్మీ ఆరాధన, 9న ఆయుధ పూజ, 10న స్వర్ణ పుష్పార్చన, 11న సహస్రనామ కుంకుమార్చన, 12న వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సుదర్శన హోమం, 13న విజయదశమి సందర్భంగా కొండదిగువ స్వామివారి పూదోటలో శమీ పూజ, 14న ఏకాదశి సందర్భంగా స్వర్ణ తులసీదళార్చన, సింహగిరిపై తిరువీధి జరగనుంది. అలాగే 16న మాస జయంతి, 17న పూర్ణిమ గ్రామ తిరువీధి, 18న తులా సంక్రమణం సింహగిరిపై తిరువీధి, 21న రోహిణీ నక్షత్రం పురస్కరించుకుని మాధవధారలోని వేణుగోపాలస్వామి సన్నిధిలో అష్టాక్షరీ హవనం, 24న పునర్వసు నక్షత్రం సందర్భంగా గంగధార సమీప సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం, 28న ఆండాళ్ మాస తిరు నక్షత్రం, గ్రామ తిరువీధి, 31న బహుళపక్ష చతుర్దశి నరక చతుర్దశి నరకాసుర వధ ఉత్సవం, ధూపసేవానంతర గ్రామ తిరువీధి, 1న అమావాస్య గ్రామ బలిహరణ, స్వాతి నక్షత్ర హవనం, గ్రామ తిరువీధి ఉత్సవాలు జరగనున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

సిబ్బంది కొరతలో పోలీసు చెక్‌పోస్టు మూత

- ఆలయాల బందోబస్తుకు పోలీసులు
- అక్రమ రవాణాపై నియంత్రణ కరువు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 3: ఏజెన్సీ ముఖద్వారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వద్ద గల పోలీస్ చెక్‌పోస్టు రెండు రోజులుగా సిబ్బంది కొరతతో మూతపడింది. ఈ చెక్‌పోస్టులో నిత్యం ఇద్దరు, ముగ్గురు సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ మద్యం అక్రమ రవాణా, గంజాయి తరలింపు వంటివి జరగకుండా తనిఖీలు చేపట్టేవారు. ప్రస్తుతం విజయవాడ కనకదుర్గ అమ్మవారు, ఇతర బందోబస్తుల కోసం కృష్ణాదేవిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దివ్యతో పాటు మరో ఆరుగురిని బందోబస్తుకు వెళ్లారు. దీంతో సిబ్బంది కొరత ఏర్పడడంతో రెండురోజులుగా చెక్‌పోస్టులో ఎవరూ ఉండడం లేదు. చింతపల్లి-కృష్ణాదేవిపేట రహదారిలో గల భీమవరంలో చెక్‌పోస్టు ఉండగా, దాన్ని గత ఎన్నికల నేపథ్యంలో కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వద్దకు తరలించారు.



కృష్ణాదేవిపేటలో మూతబడిన పోలీస్ చెక్‌పోస్టు

దీంతో ఏజెన్సీ నుంచి గంజాయి, సారా, మద్యం ఇతర అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు పోలీస్ చెక్‌పోస్టు నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

'ఉక్కు ప్రైవేటీకరణను పాలకులు అడ్డుకోవాలి'



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ గురువారం నెహ్రూచౌక్‌లో రైతు, వ్యవసాయ, కార్మిక, మహిళా సంఘాలు దీక్ష చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించాలని చూస్తున్నా రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దారుణమన్నారు. గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రంతో మాట్లాడి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి అప్పారావు, మోహనరావు, డీడీ వరలక్ష్మి, గండి నాయనబాబు, మాణిక్యాలరావు, ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి సందర్శించి మద్దతు పలికారు.

జీవో నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలి

- ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కోలపర్తి అప్పారావు భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని కూడా తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, జిల్లా అధ్యక్షుడు దర్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, నూకరాజు, పడాల అప్పారావు, మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు ప్రారంభం



'రాత' నాటికలో ఓ సన్నివేశం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3: కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రచయిత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ, పీవీ రమణ, భీమరశెట్టి వరహా నూకరాజు, కెఎం నాయుడు, కొణతాల మురళీకృష్ణ, కెఎం నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన రాత, అజరామరం నాటికలు అందర్నీ ఆలోచింపజేశాయి.

అక్రమంగా గోవులను తరలిస్తున్న కంటైనర్ లారీలు సీజ్



అక్రమంగా తరలిస్తున్న గోవులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 3: ఏజెన్సీ ప్రాంతం నుంచి గురువారం అక్రమంగా నాలుగు కంటైనర్లతో తరలిస్తున్న గోవులను వడ్డాదిలో కూటమి నేతలు అడ్డుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఒడిశా ఏజెన్సీ నుంచి తరలిస్తున్న నాలుగు కంటైనర్లలో గల గోవులను కొత్తవలసలోని గోశాలకు తరలించినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గోవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

7న 'యోకోహామా'లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

అచ్యుతాపురం, అక్టోబరు 3 : ఇక్కడి ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల ఏడో తేదీన యోకోహామా కర్మాగారంలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని కర్మాగారం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివినవారు అర్హులుగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 97012 41753 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

'కూటమి పాలన భేష్'



మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

పాయకరావుపేట రూరల్, అక్టోబరు3: కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో ప్రజలకు మంచి పాలన అందించిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని పీఎల్ పురం జంక్షన్ వద్ద ద్వారకా హోటల్‌లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అత్యధికంగా బీజేపీ సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు. అనంతరం పలువురి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అంతకు ముందు రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సీఎం రమేశ్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాకలపాటి రవిరాజు, కన్వీనర్ శ్రీరంగం రమేశ్, కోకన్వీనర్ గింజాల వెంకటరమణ, జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు

పాయకరావుపేట, అక్టోబరు 3: స్థానిక శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణ)కబడ్డీ, వాలీబాల్ పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలు శుక్రవారం ముగియనున్నాయి. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాశ్ తెలిపారు.

మిజోరం గవర్నర్ హరిబాబుకు నాగార్జున పరామర్శ



విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మిజోరం గవర్నర్, విశాఖపట్నం మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబును గురువారం సినీ నటుడు అక్కినేని నాగార్జున పరామర్శించారు. హరిబాబు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విశాఖలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సినిమా షూటింగ్ నిమిత్తం విశాఖలో ఉన్న నాగార్జున మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తో కలిసి హరిబాబు నివాసానికి వెళ్లి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు ధర్నా



జీవిత బీమా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏజెంట్లు

కొత్తూరు, అక్టోబర్ 3: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓఐ యూనియన్ అనకాపల్లి బ్రాంచి అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు మాట్లాడుతూ ఏజెంట్లకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టి నిబంధనలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.ఐదు లక్షలు ఉన్న గ్రాడ్యూటీని 10 లక్షలు చేయాలని, ఇన్సూరెన్సు పెంచాలని, ఇన్సూరెన్స్ 70 నుంచి 80 ఏళ్లకి పెంచాలని నినాదాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు గొర్లి శంకరరావు, ఉపాధ్యక్షుడు ఐతా రాము, నడిశెట్టి అప్పారావు, పీలా శ్రీనివాసరావు, ఉప్పునూరి అప్పారావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో ఎలమంచిలి టాప్‌గా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, అక్టోబరు 3 : టీడీపీ సభ్యత్వ నమోదులో ఎలమంచిలి నియోజకవర్గం జిల్లాలో నంబర్ వన్‌గా నిలవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఇక్కడి ఓ కల్యాణ మండపంలో సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ టీడీపీ అంటే కార్యకర్తలకు భరోసా అన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి వ్యక్తికి ఐదు లక్షల బీమా ఉంటుందన్నారు. ఆ పార్టీ నాయకులు కర్రి సాయికృష్ణ, రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, లాలం భవానీ భాస్కర్, జనపరెడ్డి నర్సింగరావు, దిన్‌బాబు, మేరుగు బాపునాయుడు, పీలా తులసీరామ్, రాజాన నానాజీ, మామిడి శివ అప్పారావు పాల్గొన్నారు.